

న్యాయం చేయాలని ఎమ్మెల్సీకి వినతి

పోరుమామిళ్ల టౌన్ : తమకు కేటాయించిన స్థల విషయంలో అన్యాయం జరిగిందని, న్యాయం చేయాలని టీచర్స్ అసోసియేట్ అధ్యక్షులు బాలసబ్బయ్య, కార్యదర్శి సి.హెచ్. వీరయ్య ఎమ్మెల్సీ డి.సి. గోవిందరెడ్డికి విన్నవించారు. ఆదివారం వారు ఎమ్మెల్సీతోపాటు రంగసముద్రం సర్పంచ్ చిత్తారవిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1982లో అప్పటి రెవెన్యూ డివిజన్ అధికారి రంగ సముద్రం పంచాయతీలో ఎకరా 60 సెంట్లు టీచర్లకు కేటాయించారని చెప్పారు. 2007లో అప్పటి తహశీల్దార్ స్పందించి రీసర్వే చేయించి 431 మందికి ప్లాట్లు కేటాయించి డిఫారాలు ఇచ్చారని తెలిపారు. ఇటీవల జగనన్న కాలనీ కోసం తమకు కేటాయించిన స్థలాన్ని ఇవ్వడం కోసం రెవెన్యూ అధికారులు చదును చేయించారని, ఈ విషయంలో తమకు న్యాయం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో రంగసముద్రం టీచర్ కాలనీ సొసైటీ టీచర్ సభ్యులు రామ్మోహన్, రామసుబ్బారావు, పి శ్రీరాములు,జయరామిరెడ్డి , సి బాలసుబ్బయ్య, ఎస్. టి.కె.రామమోహన్, మధు, పోలయ్య పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక ప్రణాళిక

- రూ.17.28 కోట్లతో ప్రతిపాదనలు
- రూ.170.11 కోట్లతో ఇంటింటికీ కుళాయి
- అక్టోబర్ నాటికి పులివెందుల వాటర్‌గ్రిడ్ సిద్ధం
- జగనన్న కాలనీల్లో తాగునీటి పైప్‌లైన్ పనులు
- ఆర్‌డబ్ల్యూఎస్ సూపరింటెండెంట్ ఇంజినీర్ వీరన్న



ముఖా ముఖి..

ప్రజాశక్తి - కడపప్రతినిధి

జిల్లాలో తాగునీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాం. మార్చి నెల నుంచి అమల్లోకి రానుంది. జిల్లాలోని 35 మండలాల పరిధిలోని తాగునీటి వనరులైన చేతిపంపులు, బోర్లు, సిపిడబ్ల్యు స్కీముల పనితీరును పరిశీలించడమైంది. జిల్లాలో 517 తీవ్ర ప్రభావిత హ్యాబిటేషన్లుగా గుర్తించాం. బద్వేల్ నియోజకవర్గ పరిధిలోని ఆరు మండలాల్లో ట్రాన్స్‌పోర్టేషన్ సమస్య ఎదురయ్యే అవకాశం ఉందని భావించాం. ఈమేరకు జిల్లాలోని ఎంపిడిఓ, ఆర్ డబ్ల్యుఎస్ ఎఇలతో కలిసి సంయుక్తంగా తాగునీటి ఎద్దడి నివారణపై దృష్టి సారించడమైందని పేర్కొంటున్న ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ వీరన్నతో ప్రజాశక్తి ముఖాముఖి...

తాగునీటి వనరుల వివరాలు తెలపండి?

జిల్లాలోని ఏడు నియోజకవర్గాల పరిధిలోని 35 మండలాల్లో 549 పంచాయతీలు ఉన్నాయి. ఇందులో 6,715 చేతిపంపులు, పిడబ్ల్యుఎస్, ఎంపిడబ్ల్యుఎస్, డిపి స్కీములు 2,772, సిపిడబ్ల్యు స్కీములు 15 ఉండగా, ఒకటి మినహా మిగిలిన స్కీములన్నీ ఆక్టివ్‌గా ఉన్నా యి.

తాగునీటి ఎద్దడి నివారణ ప్రతిపాదనలు చెప్పండి?

జిల్లాలోని 35 మండలాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు సంబంధించి రూ.17.28.44 కోట్లకు ప్రతిపాదనలు అందజేశాం. ఈయేడాది మార్చి నుంచి జూన్ వరకు నిధులను ఖర్చు చేసే అవకాశం ఉంది. తాగునీటి బోర్ల ఫ్రెస్సింగ్,ఫ్లస్సింగ్, డీపెనింగ్, ట్రాన్స్‌పోర్టేషన్ చేయడానికి ఖర్చు చేయాల్సి ఉంది.

పులివెందుల వాటర్‌గ్రిడ్ పనుల గురించి తెలపండి?

రూ.460 కోట్లతో పులివెందుల వాటర్‌గ్రిడ్ పనులు చేపట్టాం. పులివెందుల నియోజకవర్గ పరిధిలోని ఏడు మండలాల పరిధిలో 299 హ్యాబిటేషన్స్‌కు తాగునీటిని అందించడానికి కసరత్తు చేస్తోంది. మెగా ఇంజినీరింగ్ కన్స్‌స్ట్రక్షన్ పనులను వేగంగా చేపడుతోంది. ఇప్పటికి 75శాతం పనుల్ని పూర్తి చేసింది. ఈయేడాది మే నెల నా టికి అందుబాటులోకి తేవాల్సి ఉంది. అక్టోబర్ నాటికి పూర్తి స్థా యిలో అందుబాటులోకి తెస్తాం.

సిపిడబ్ల్యుఎస్ స్కీముల పని తీరు ఎలా ఉంది?

జిల్లాలో 15 సిపిడబ్ల్యు స్కీములున్నాయి. ఇందులో ఒంటిమిట్ట సిపిడబ్ల్యు స్కీము మినహా మిగిలిన 14 స్కీములు పని చేస్తున్నాయి. 477 హ్యాబిటేషన్ల పరిధిలో 3,74,152 మందికి తాగునీటిని అం దించడమైంది.

జగనన్నకాలనీల్లో తాగునీటి సరఫరా గురించి చెప్పండి?

జిల్లావ్యాప్తంగా 496 లేఅవుట్లలో తాగునీటి సరఫరా పైప్ లైన్ పనులు పురోగతిలో ఉన్నాయి. ఇందులో 226 తాగునీటి సర ఫరా పైప్‌లైన్ పనులు పూర్తి చేశాం. 70 పైప్‌లైన్ పనులు పురోగతి లో ఉన్నాం. 354 బోర్లు వేశాం. ఇందులో 323 బోర్లకు మోటార్లను ఏర్పాటు చేసి తాత్కాలిక ప్రాతిపదికన తాగునీటిని సరఫరా చేయడం జరిగింది.

సిఎస్‌పి పనుల పురోగతి గురించి తెలపండి?

జిల్లాలో 406 కమ్యూనిటీ సొసైటీ కాంప్లెక్స్ చేపట్టడమైంది. ఇందులో 365 కాంప్లెక్స్ పూర్తి చేశాం. వీటితోపాటు 41 పనులు పురోగతిలో ఉన్నాయి.

గడప గడపకు కార్యక్రమ సమస్యల పరిష్కారమేమిటి?

గడపగడపకూ మనప్రభుత్వం కార్యక్రమం దృష్టికి 231 సమస్య లు ఎదురు కావడమైంది. ఇందులో 31 సిసిడ్రెయిన్లు, బోర్లు, మోటా ర్లు, 179 పనులు పురోగతిలో ఉన్నాయి. ఇందులో 13 బిల్లులను అప్‌లోడ్ చేయడమైంది.

జల్‌జీవన్ పనుల పురోగతి ఎలా ఉంది?

జిల్లాలో రూ.170.11కోట్లతో జల్‌జీవన్‌స్కీమ్ కింద పనులు చేపట్టడమైంది. ఈమేరకు 2,521 పనులు మంజూరు చేశాం. ఇందులో 843 పనులు పూర్తి చేశాం. జిల్లావ్యాప్తంగా 334 ప్రోగ్రెస్‌లో ఉన్నా యి. ఈనేపథ్యంలో రూ.26.87 కోట్లతో 26,094 ఇళ్లకు కుళాయి కలెక్షన్స్ ఇవ్వాల్సి ఉంది. ఇందులో 13,647 కుళాయి కలెక్షన్లు ఇచ్చాం.

పన్నుల వసూళ్లలో కమిషనర్ వైఖరి మారాలి

ప్రజాశక్తి -కడప అర్బన్

నగరపాలక సంస్థ అధికార యంత్రాంగం పన్నులు వసూలు చేయడంలో సామాన్యుల మీద ఒకరకంగా, అధికార పార్టీ నేతల పట్ల ఇంకొక రకంగా వ్యవహరించటం సమంజసం కాదని, ఈ విషయంలో కమిషనర్ వైఖరి మారాలని సిపిఎం నగర కార్యదర్శి ఎ.రామమోహన్, నగర కమిటీ సభ్యులు ఓబులేసు, పరుక్ హుస్సేన్ పేర్కొన్నారు. ఆదివారం పాత బస్టాండ్‌లోని సిపిఎం కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల కాలంలో నగరంలో సచివాలయ సిబ్బంది, కార్పొరేషన్ అధికారులు పెండింగ్ లో ఉన్న పన్నుల వసూళ్లకు పాల్పడుతున్నారని చెప్పారు. కుళాయి పన్ను కట్టకపోతే ఇంటికి కనెక్షన్ తొలగిస్తామని అధికారులు చెపుతున్నారన్నారు. అయితే కుళాయి పన్ను ఆలస్యమైతే అధికంగా పన్నులు వేసి ప్రజానీకాన్ని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. నగరానికి చెందిన ఒక డివిజన్ లో ఒక ఇంటికి చెల్లించాల్సిన పన్ను బకాయి రూ.21250 ఉండగా దానిమీద రూ.31,153 కలిపి మొత్తం రూ.54941 అపరాధ రుసుం విధించారని, ఇది ఏ రకంగా సమంజసమని ప్రశ్నించారు. ఇంత పెద్ద ఎత్తున పెనాల్టీలు విధిస్తున్నా, మళ్లీ కట్టలేదని కారణంతో కుళాయి కనెక్షన్ కట్ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికార పార్టీకి చెందిన కొద్ది మంది వ్యక్తులు లక్షల రూపాయల్లో బకాయిన్న ఇళ్లకి కనెక్షన్ తొలగించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. సామాన్య ప్రజలు వేలల్లో తక్కువ మొత్తంలో చెల్లించాల్సి ఉన్నా ఇంటికి కుళాయి కలెక్షను తొలగిస్తున్నారని వాపోయారు. నగరపాలక యంత్రాంగం అధికార పార్టీకి తొత్తుగా మారిందని, సామాన్యులను వేధించడమే పనిగా పెట్టుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి పద్ధతులకు నగరపాలక సంస్థ స్వస్తి చెప్పకపోతే సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటాలు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం నగర కార్యదర్శి రామమోహన్

ప్రశాంతంగా ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షలు



ప్రాక్టికల్స్ పరీక్షలను పర్యవేక్షిస్తున్న ఆర్ఐఒ రమణరాజు

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లాలో ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఆదివారం ఉదయం జనరల్ విద్యార్థుల కోసం 64 సెంటర్లు, ఒకేషనల్ విద్యార్థుల కోసం 10 సెంటర్లు కేటాయించారు. 2,846 మంది విద్యార్థులు ప్రాక్టికల్స్ హాజరు కావాల్సి ఉండగా 2,763 మంది హాజరయ్యారు, 83 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 623 మంది హాజరు కావాల్సి ఉండగా 591 మంది హాజరయ్యారు, 32 మంది గైర్హాజరయ్యారు. మొత్తం 3469 కి గాను 3354 మంది హాజరయ్యారు, 115 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం పరీక్షలకు 62 సెంటర్లు జనరల్, 10 వొకేషనల్ విద్యార్థులకు కేటాయించారు. జనరల్ విద్యార్థులు 2,161 మంది దరఖాస్తు చేసుకోగా 2,094 మంది హాజరయ్యారు, 67 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ కు సంబంధించి 551 మంది దరఖాస్తు చేసుకోగా 528 మంది హాజరయ్యారు, 23 మంది గైర్హాజరయ్యారు. మొత్తం 2,712 మంది దరఖాస్తు చేసుకోగా 2,622 మంది హాజరయ్యారు, 90 మంది గైర్హాజరయ్యారు. ఆర్ ఐ ఓ రమణ రాజు నగరంలోని పలు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు.

మొల్ల కీర్తికిరీటాన్నిశిఖరాయమానం చేసిన 'గానుగపెంట'

-పుట్టపర్తి సాహితీ పీఠం ప్రధాన కార్యదర్శి జింకా సుబ్రహ్మణ్యం

ప్రజాశక్తి - కడప అర్బన్

మొల్ల పేరుతో సాహితీ పీఠాన్ని నెలకొల్పడంతోపాటు బద్వేలు సమీపంలోని గోపవరంలో మొల్ల విగ్రహాన్ని ఏర్పాటుచేసి పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్ది మొల్ల కీర్తికిరీటాన్ని శిఖరాయమానం చేసిన మహోన్నత వ్యక్తి విద్వాన్ గానుగపెంట హనుమంతరావని పుట్టపర్తి సాహితీ పీఠం ప్రధాన కార్యదర్శి జింకా సుబ్రహ్మణ్యం అన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం నిర్వహిస్తున్న 'నెలనెలా సీమ సాహిత్యం' కార్యక్రమంలో భాగంగా ఆదివారం బ్రౌన్‌శాస్త్రి సమావేశ మందిరంలో 117వ సదస్సు నిర్వహించారు. 'విద్వాన్ గానుగపెంట హనుమంతరావు జీవితం – సాహిత్యం' అనే అంశంపై పుట్టపర్తి సాహితీ పీఠం ప్రధాన కార్యదర్శి జింకా సుబ్రహ్మణ్యం ప్రసంగించారు. గానుగపెంట హనుమంతరావు మొల్ల స్థానికతపై పరిశోధించి, శాస్త్రీయమైన ఆనవాళ్ళను సేకరించి ఆమెను బద్వేలు సమీపంలోని గోపవరంవాసిగా నిరూపించారన్నారు. మరో అడుగు ముందుకువేసి అప్పటి ప్రభుత్వాన్ని ఒప్పించి గోపవరాన్ని పర్యాటక ప్రాంతంగా గుర్తింపజేసి కోటి రూపాయల నిధులను మంజూరు చేయించి, అక్కడ పర్యాటక హోటల్‌ను నిర్మించడంలో క్రియాశీలకపాత్ర పోషించారన్నారు. అక్కడే మొల్లమందిరాన్ని తన సొంతఖర్చుతో నిర్మించారన్నారు. మొల్లపై గల అపారమైన గౌరవంతో తపాలాశాఖవారితో మొల్ల పేరుతో తపాలాబిళ్ళను, ప్రత్యేక కవరును విడుదల చేయించారన్నారు. పలు దినపత్రికల్లో పాత్రికేయులుగా పనిచేసి అనేక సాహిత్య, సామాజిక, రాజకీయ అంశాలను వెలుగులోకి తీసుకువచ్చారన్నారు. కార్యక్రమ ప్రారంభంలో సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి, సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి, డాక్టర్ చింతకుంట శివారెడ్డి, గ్రంథపాలకులు, ఎన్.రమేష్‌రావు, జూనియర్ అసిస్టెంట్ ఆర్.వెంకట రమణ, రాజారెడ్డి, మూల అయ్యవారురెడ్డి, కొత్తపల్లె రామాంజనేయులు కలసి వక్త జింకా సుబ్రహ్మణ్యాన్ని ఘనంగా సత్కరించారు. కార్యక్రమం చివరలో విద్వాన్ గానుగపెంట హనుమంతరావు తన స్పందనను తెలియజేస్తూ తన కృషిని గుర్తించి సి.పి.బ్రౌన్ గ్రంథాలయం వారు ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జానమద్ది విజయ భాస్కర్, అలపర్తి పిచ్చయ్య చౌదరి, గోవిందరెడ్డి, డాక్టర్ చిన్నలక్ష్మీకళావతి, కె.వి.రమణారెడ్డి, మాచిరాజు రమణయ్య, చంద్రశేఖర రెడ్డి, గంగనపల్లె వెంకటరమణ, ఆదినారాయణ రెడ్డి, సాయిబాబా, మల్లయ్య, శివశ్రీ శర్మ, సుధీర్ శర్మ, పార్వతమ్మ, స్వర్ణలత, కుమార్ పాల్గొన్నారు.

బకాయిల చెల్లింపుల్లో జాప్యమెందుకు?

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్ర ఆర్థిక పరిస్థితికి ఎటువంటి ఢోకా లేదని చెబుతున్న ప్రభుత్వం ఏడాదిగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించా ల్సిన జడ్‌పిఎఫ్, ఎపిజిఎల్ఐ, సరెండర్ లీవ్, డిఎ బకాయిలు ఎందుకు చెల్లించడం లేదని ఎస్టిఇయు రాష్ట్ర అధ్యక్షులు ఎల్.సాయిశ్రీనివాస్ ప్రశ్నించారు. ఆదివారం వివిఆర్ ఎస్‌టియు భవన్ లో జిల్లా అధ్యక్షులు పి.రమణారెడ్డి అధ్యక్షతన ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిశ్రీనివాస్ మాట్లాడుతూ అత్యవసర కుటుంబ అవసరాల నిమిత్తం ఉద్యోగ, ఉపాధ్యాయులు పొదుపు చేసుకున్న సొమ్ము కోసం కళ్లు కాయలు కాసేలా ఎదురు చూడాల్సిన దుస్థితి నెలకొందన్నారు.ఉద్యోగ ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలన్నీ త్వరగా చెల్లించి మాట నిలబెట్టుకోవాలని కోరారు. నగదు రహిత వైద్యసేవల్లో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. రాష్ట్ర మాజీ ప్రధానకార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి మాట్లాడుతూ ఇచ్చిన హామీ మేరకు సిపిఎస్‌ను రద్దు చేయకుండా కమిటీలతో కాలయాపన చేస్తూ, ఉద్యోగుల జీవితాలకు ఎటువంటి గ్యారెంటీ లేని జిపిఎస్‌ను ప్రవేశపెట్టాలనే ఆలోచనను ఉపసంహరించుకోవాలన్నారు. ఓపియస్‌ను తప్ప ఎటువంటి ప్రత్యామ్నయాన్ని అంగీకరించే ప్రసక్తే లేదన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా డిఎలు మంజూరు చేయకుండా పెండింగ్‌లో పెట్టడం ఏంటని ప్రశ్నించారు. ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం చేయకుండా ఇదే మొండి వైఖరిని ప్రదర్శిస్తే ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్నకేశవరెడ్డి, రాష్ట్ర నాయకులు సుబ్రమణ్యంరాజు, బాలగంగిరెడ్డి, దాదాపీర్, ఇలియాస్ బాషా, ఆదినారాయణరెడ్డి, సంగమేశ్వరరెడ్డి, బాలరాజు, ఎపిఎమ్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, ఏఐటియుసి నాయకులు నాగసుబ్బారెడ్డి, సీనియర్ నాయకులు సురేష్ బాబు, రమణయ్య, జయరామయ్య,శివారెడ్డి పాల్గొన్నారు.

రక్తదానం అభినందనీయం

పోరుమామిళ్ల టౌన్ : జిల్లాలోని కడప, ప్రొద్దుటూరు ,బద్వేలు, పోరుమామిళ్ల ప్రాంతాలలో దాతలు రక్తదానం చేయడం అభినందనీయమని రైట్‌హ్యాండ్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులు ప్రసాద్, రసూల్ పేర్కొన్నారు. ఆదివారం వారు విలేకర్లతో మాట్లాడుతూ వివిధ అనారోగ్య కారాణాలతో బాధపడుతున్న వారికి దాతలు రక్తదానం చేసి నిండు ప్రాణాలు కాపాడ్డం సంతోషకరమన్నారు. . పోరు మామిళ్లకు చెందిన శ్రీరాముల రెడ్డి పక్షవాతంతో ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో చేరగా ఆయనకు అత్యవసరంగా బి. పాజిటివ్ రక్తం అవసరమైందని, బంధువులు తమ ట్రస్ట్‌ను ఆశ్రయించడంతో కర్నూలుకు చెందిన నవీన్ అనే వ్యక్తి దానం చేశారన్నారు. శనివారం ఒక్కరోజే సుమారు ఏడుగురు రక్తదానం చేశారని తెలిఆపరు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యుడు అఖిల్,శివ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మహేష్ బాబు

పిడిఎఫ్ ఎమ్మెల్సీల కృషి అభినందనీయం

-యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేష్ బాబు

ప్రజాశక్తి- కడప అర్బన్

మున్సిపల్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు డిడిఒ అధికారాలు కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వడంలో యుటిఎఫ్ పోరాట పటిమ, పిడిఎఫ్ ఎమ్మెల్సీల అంకురిత దీక్ష ఎంతో ఉందని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు అన్నారు. ఆదివారం యుటిఎఫ్ భవన్ లో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల విద్యాశాఖలోకి మున్సిపల్ ఉపాధ్యాయులను తీసుకురావడంలోనూ, మున్సిపల్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు డిడిఓ అధికారాలు కల్పించడంలోనూ యుటిఎఫ్ నిరంతరం పోరాటం చేసిందని తెలిపారు. ఆ పోరాటానికి పిడిఎఫ్ ఎమ్మెల్సీలు తోడై అటు ఆర్థిక శాఖ అధికారులతోనూ, ఇటు విద్యాశాఖ అధికారులతోనూ, మున్సిపల్ శాఖ అధికారులతోనూ సమన్వయం చేసి అసాధ్యం అనుకున్న పనిని సుసాధ్యం చేశారని చెప్పారు. చాలా సంఘాలు మున్సిపల్ ఉపాధ్యాయులను పాఠశాల విద్యలోకి విలీనం చేయడం అసాధ్యమని ఎద్దేవ చేసినా పిడిఎఫ్ ఎమ్మెల్సీలు మాత్రం పట్టు వదలని విక్రమార్కుల్లా ప్రభుత్వంతో పోరాడి మున్సిపల్ ఉపాధ్యాయుల చిరకాల వాంఛ నెరవేర్చడంలో ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా పిడిఎఫ్ ఎమ్మెల్సీల ద్వారానే ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారం సాధ్యమని తెలిపారు. మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో యుటిఎఫ్, పిడిఎఫ్ ఎమ్మెల్సీలు ఎప్పుడు ముందుంటారని తెలిపారు. భవిష్యత్తులో కూడా వారి సమస్యల పైన పోరాడుతామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి దావుద్దీన్, ఆడిట్ కమిటీ కన్వీనర్ నరసింహారావు, జిల్లా కార్యదర్శి సి.వి.రమణ, నాయకులు కిరణ్ కుమార్, సుజిత్, జావీద్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం సంతోషకరం

ప్రజాశక్తి- కడప అర్బన్



మందులు అందజేస్తున్న శ్రీనివాసరెడ్డి

జమీల్ మొబైల్స్ అధినేత జమీల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమని టిడిపి పోలీసు బ్యూరో సభ్యులు ఆర్. శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆదివారం నగరంలోని బెల్లం బండిలో ఉన్న హాజరత్ ఆయేషా మోడల్ స్కూల్లో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15 మంది సీనియర్ డాక్టర్లచేత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. ఎంతోమంది పేదలు ఆర్థిక స్థోమత లేక రోగాలతో కొట్టుమిట్టాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటు వంటి వారికి వైద్య పరీక్షలు ఎంతో ఉపయోగంగా ఉంటాయని తెలిపారు. వైద్య శిబిరం నిర్వహకులు జమీల్ మాట్లాడుతూ ఉదయం 8 నుంచి సాయంత్రం 5 వరకు వైద్య శిబిరం నిర్వహించామని చెప్పారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. విద్యాసాధన కళాశాల కరస్పాండెంట్ పి.మన్సూర అలీ ఖాన్ మాట్లాడుతూ అన్ని రకాల జబ్బులకు వైద్యులు పరీక్షలు నిర్వహించారని తెలిపారు. నగర ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనడం హర్షనీయమన్నారు. జన వికాస సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు తాహిర్ మాట్లాడుతూ ఉచిత వైద్యంతో పాటు మందులు కూడా ఉచితంగా అందించాలని పేర్కొన్నారు. ఖూన్ కా రిస్తా వ్యవస్థాపకులు తారీకు ఆలీ మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరానికి తమ సహాయ సహకారాలను అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో షేక్. అఖిల్ అహ్మద్ పాల్గొన్నారు.

శాంతి సమాజం కోసం దోహదపడాలి

కడప : యువత శాంతి సమాజం కోసం దోహదపడాల్సిన అవసరం ఎంతైనా ఉందని పాస్టర్ పి మహేష్ పేర్కొన్నారు. కడప నగరం, 48 డివిజన్, కృపా కాలనీలో న్యూ నేటివ్ కృపా మినిస్ట్రీస్ అధ్యక్షులు పాస్టర్ పి.మహేష్, సిస్టర్ శాంతమ్మ ఆధ్వర్యంలో ఆదివారం ప్రపంచంలో ఉండే 195 దేశాల ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలన్నారు. పాస్టర్ పి.మహేష్ మాట్లాడుతూ ముఖ్యంగా యువతి, యువకులు చెడు వ్యసనాలకు దూరమై, ప్రభావితమైన మొబైల్‌కు బానిసలు కాకుండా, శాంతి సమాజం కోసం పాటుపడాలన్నారు. కార్యక్రమంలో పలువురు విశ్వాసులు, చర్చి ప్రతినిధులు పి.రవితేజ, ఏ.అగస్టిన్, శాంతిరాజు, రోజా, దావీదు, సరళ, సుగుణమ్మ, పార్వతమ్మ, లీలావతి, లక్ష్మీ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసులు రెడ్డి

చిత్రకారులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

- సిఐటియు జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు రెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్

చిత్రకారులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ప్రెస్ క్లబ్ లో కడప జిల్లా చిత్రకారుల సంక్షేమ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిత్ర కళాకారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రచారానికి సంబంధించి గోడ రాతలు స్థానికంగా ఉండే చిత్ర కళాకారులకే ఇవ్వాలని పేర్కొన్నారు. పెద్ద పెద్ద కంపెనీ లైన్ యూనిట్స్, ప్రసాద్ యాడ్స్ వారికి ఇవ్వకుండా స్థానిక కళాకారులకు ఇచ్చి వారి కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. తక్షణం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి చిత్ర కళాకారులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని కోరారు. కార్మిక శాఖ నుంచి గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. గతంలో ఏ విధంగా భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ఉందో అదేవిధంగా చిత్ర కళాకారులకు అవకాశం కల్పించాలని చెప్పారు. డ్రాయింగ్, క్రాఫ్ట్ ఖాళీగా ఉన్న ఉద్యోగాలలో అర్హత ఉన్నవారిందని నియమించాలని తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడు శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఐక్యంగా సమస్యలపై పోరాటాలు నిర్వహించి ప్రభుత్వం దగ్గర నుంచి మనకు రావాల్సిన వాటిని సాధించుకోవాలని పిలుపునిచ్చారు. వెల్ఫేర్ బోర్డ్ గురించి రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేయాలని పేర్కొన్నారు. రాష్ట్ర కార్యదర్శి దేవి రవి, రాష్ట్ర నాయకులు హనుమంతు, అన్వర్, అనిల్, మున్నా, హుస్సేన్ పాల్గొన్నారు.

అప్పర్ భద్రపై సిఎం స్పందించకపోవడం దారుణం

కడప అర్బన్ : కర్ణాటక ప్రభుత్వం తుంగభద్రపై అప్పర్ భద్ర ప్రాజెక్టు నిర్మించనుందని, దీనిపై ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి స్పందించకపోవడం దారుణమని టిడిపి జిల్లా అధ్యక్షులు లింగారెడ్డి అన్నారు. ఆదివారం టిడిపి జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అప్పర్ భద్ర నిర్మిస్తే రాయలసీమ ఎడారిగా మారుతుందని హెచ్చరించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఈ ప్రాజెక్టుకు నిధులు కేటాయించడం దుర్మార్గమన్నారు. రాయలసీమ రైతాంగానికి, ప్రజలకు నీటి కష్టాలను తెచ్చే ప్రాజెక్టు నిర్మాణంపై అధికార పార్టీ మంత్రులు కానీ, ఎమ్మెల్యేలు కానీ, రాయలసీమ ఉద్యమకారులు కానీ స్పందించకపోవడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. రాయలసీమ రైతాంగ, ప్రజల ప్రయోజనాలను కాలరాయ వద్దని పేర్కొన్నారు. కేవలం సిఎం జగన్మోహన్‌రెడ్డి నేరాలు, అక్రమాలు, అప్పులు, వివేకానంద హత్య కేసు, సిబిఐ విచారణ నుంచి బయట పడడానికి కేంద్రానికి మోకరిల్లారని విమర్శించారు. ప్రతిపక్ష పార్టీలను, విద్యార్థి, యువజన, ప్రజా సంఘాలను కలుపుకొని వైసిపి ఎమ్మెల్యేలను రాయలసీమలో తిరగనివ్వమని, ఇళ్ల ఎదుట ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కడప నియోజకవర్గ ఇన్‌ఛార్జి అమీర్ బాబు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పే రోజులు దగ్గర పడ్డాయని చెప్పారు. అప్పర్ భద్ర నిర్మాణంపై రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. సమావేశంలో జిల్లా అధికార ప్రతినిధి బాలదాసు, కార్యదర్శి సిద్ధయ్య, కార్యనిర్వాహక కార్యదర్శి మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

మానసిక ఉల్లాసానికి క్రీడలు అవసరం

ప్రజాశక్తి-పోరుమామిళ్ల టౌన్



క్రీడలను పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్సీ డి.సి. గోవిందరెడ్డి

విద్యార్థుల మానసిక, శారీరక ఎదుగుదలకు క్రీడలు ఎంతో అవసరమని ఎమ్మెల్సీ డి.సి. గోవిందరెడ్డి అన్నారు. ఆదివారం తేక్వాండో జూనియర్ ఛాంపియన్‌షిప్ వేడుక లును సిరి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ మాట్లాడుతూ క్రీడలలో జిల్లా నలుమూలల నుంచి సబ్ జూనియర్, జూనియర్ విభాగంలో పాల్గొనేందుకు 160 మందికి పైగా విద్యార్థులు పాల్గొంటున్నట్లు తెలిపారు. తేక్వాండో మాస్టర్ షేక్. నాయబ్ రసూల్ ఆధ్వర్యంలో క్రీడలు జిల్లా స్థాయిలో పోరుమామిళ్లలో ఏర్పాటు చేయడం ఎంతో సంతోషంగా ఉందని మండల ఉపాధ్యక్షులు సి.భాష పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు సి.బాషా, రంగసముద్రం సర్పంచ్ చిత్తా రవిప్రకాష్ రెడ్డి, చాపాటి సాయి నారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఈతకెళ్లి విద్యార్థి మృతి

ప్రజాశక్తి -ఖాజీపేట



మృతిచెందిన విద్యార్థి కార్తీక్

స్థానిక సుంకేసుల రోడ్డులోని సమీకృత బాలుర వసతి గృహం కార్తీక్ (15) ఆదివారం ఈతకెళ్లి మృతి చెందాడు. వివ రాలు.. బద్వేల్ పట్టణం గౌరీ శంకర్ కాలనీకి చెందిన ప్రసాద్, రత్నమ్మ దంపతుల కుమారుడు కార్తీక్ పదో తరగతి ఖాజీపేట వసతి గృహంలో ఉంటూ చదువుకుంటున్నాడు. ఆదివారం మధ్యాహ్నం వసతి గృహంలో విద్యార్థులందరూ భోజనం తర్వాత విశ్రాంతి తీసుకుంటుండగా, కొందరు విద్యార్థులు గోడ దూకి సమీపంలోని ఓ బావిలో సరదాగా ఈతకెళ్లారు. కార్తీక్‌కు ఈత రాకపోవడంతో మునిగిపోయాడు. ఈ విషయాన్ని తోటి విద్యార్థులు వసతి గృహ సిబ్బందికి తెలియజేయడంతో వారు హుటాహుటినా సంఘటనా స్థలానికి వెళ్లారు. అప్పటికే బాలుడు మృతిచెందాడు. వసతి గృహ సిబ్బంది పర్యవేక్షణ లేకపోవడం వల్లే విద్యార్థులు గోడ దూకి బయటకు వెళ్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. ఇదీలా ఉండగా తాము వసతి గృహంలో ఉండగానే మధ్నాహ్న సమయంలో విద్యార్థులు గోడదూకి వెళ్లారని సిబ్బంది చెబుతు న్నారు. సమాచారం అందుకున్న సిఐ నరేంద్రరెడ్డి, ఎస్ఐ కులాయప్ప, సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. మృతుడి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని తెలిపారు. బాలుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు.

సాక్షులను బెదిరించి విత్ డ్రా చేయించారు

-టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి -కడప అర్బన్

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఇండిపెండెంట్ అభ్యర్థికి స్థానికంగా ఓటర్లు ఉన్న వారు సాక్షి సంతకం చేశారని, వీరిని వైసిపి అభ్యర్థి రామసుబ్బారెడ్డి బెదిరించి విత్‌డ్రా చేయించారని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం గాయత్రి టవర్స్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసిపి వ్యతిరేక అభ్యర్థులకు, చాంబర్ ఆఫ్ కామర్స్ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని టిడిపి అధిష్టానం నిర్ణయించిందని, ఆ కోవలో మాజీ సర్పంచ్ రమణ అనే ఇండిపెండెంట్ అభ్యర్థికి మద్దతు ఇచ్చామని చెప్పారు. రామ సుబ్బారెడ్డికి ధైర్యం ఉంటే ఈ విషయంపై ప్రమాణం చేయాలని నిలదీశారు. శ్రీనివాసరెడ్డి పోటీ చేయొచ్చు కదా అని అనడం హాస్యాస్పదమన్నారు. మీలా పార్టీ మారే మనస్తత్వం తనది కాదని చెప్పారు. చంద్రబాబు నాయుడు 30 సంవత్సరాలు రామ సుబ్బారెడ్డిపై నమ్మకం పెట్టుకున్నారని, చివరికి పార్టీకి ద్రోహం చేసి వైసీపీలో చేరారని విమర్శించారు. కేవలం పదవి కోసమే అక్కడికి వెళ్లారని తెలిపారు.

అపోలో ఆస్పత్రిలో రోబోటిక్ సర్జరీ

- సీనియర్ ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ మదన్ మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్

నెల్లూరు అపోలో స్పెషాలిటీ ఆసుపత్రిలో మోకాళ్ల మార్పిడి శస్త్ర చికిత్స రోబోటిక్ ద్వారా చేసినట్లు సీనియర్ ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ మదన్ మోహన్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని మానస ఇన్ హోటల్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోకాళ్ల మార్పిడి శస్త్ర చికిత్సలు అత్యాధునిక టెక్నాలజీతో నిర్వహించే రోబోటిక్ సర్జరీ ఇప్పటికే విజయవంతమైందని తెలిపారు. నెల్లూరు జిల్లాతో పాటు చుట్టుపక్కల ఉన్న వారి సౌకర్యార్థం రోబోటిక్ సర్జరీ అందుబాటులో ఉంచామని చెప్పారు. గతంలో మోకాలి మార్పిడి శస్త్ర చికిత్స అనేక ఇబ్బందులు ఉండవేని పేర్కొన్నారు. రోబోటిక్ సర్జరీ ద్వారా నొప్పి, కోత తక్కువగా ఉండడం వల్ల రోగి త్వరగా కోలుకుంటారని తెలిపారు. మహానగరాలకే పరిమితమైన మోకాలి మార్పిడి రోబోటిక్ సర్జరీని నెల్లూరు అపోలో స్పెషాలిటీ ఆసుపత్రిలో అందుబాటులోకి తెచ్చామన్నారు. అవసరమైన వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో డాక్టర్ కార్తీక్ రెడ్డి, డాక్టర్ వివేకానంద రెడ్డి, డాక్టర్ శశిధర్ రెడ్డి, డాక్టర్ పృధ్వి, అపోలో ఇన్ఫర్మేషన్ సెంటర్ అరుణాచల ఆసుపత్రి డాక్టర్ నిరంజన్ రెడ్డి, డాక్టర్ మమతేశ్వరి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ మదన్ మోహన్‌రెడ్డి



కాంటెస్ట్‌లో పాల్గొన్న విద్యార్థులు

చైతన్య కాంటెస్ట్‌కు విశేష స్పందన

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

పట్టణ పరిధిలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చైతన్య కాంటెస్ట్‌ను ప్రొద్దుటూరు ఇస్కాన్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. కమలాపురం, ముద్దనూరు, ఎర్రగుంట్ల మండలాలల ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలకు చెందిన 550 మంది విద్యార్థులు హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు. భవిష్యత్‌లో ఏ విధంగా ఉన్నత స్థాయికి ఎదగాలో తెలియజేసే అంశాలపై విద్యార్థులకు ఈ కాంటెస్ట్ నిర్వహించినట్లు తెలిపారు. ఇందులో పాల్గొన్న విద్యార్థులకు మొదటి బహుమతిగా రూ.10వేలు, రెండవ బహుమతిగా రూ.5,000, మూడవ బహుమతి రూ.3వేలు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. తర్వాత పదిమంది విద్యార్థులకు కన్సోలేషన్ బహుమతులు ఇవ్వనున్నట్లు తెలిపారు. బహుమతులను ప్రొద్దుటూరులోని అనిబిసెంట్ మైదానంలో మార్చి 7న జరగబోవు 'గౌరవ పూర్ణిమ' రోజున విద్యార్థులకు అందించనున్నట్లు ఇస్కాన్ సంస్థ సభ్యులు తెలిపారు.

సమాజ సేవలో పాల్గొనడం అదృష్టం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

రోటరీ క్లబ్ చేసే సామాజిక సేవ కార్యక్రమాల్లో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నామని రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ కుండా భాస్కర్, ప్రధాన కార్యదర్శి కాటం పార్థ సారథి, ముద్దనూరు మండల వ్యవసాయ అధికారి, రోటరీ క్లబ్ మెంబర్ మారెడ్డి వెంకట కృష్ణారెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఎస్పీ డిగ్రీ కళా శాలలో ఆదివారం వారు మాట్లాడుతూ రోటరీ క్లబ్ (ఆర్.ఐ.డి 3160) నెల్లూరులోని విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో రెండు రోజులపాటు జరిగిన 39వ జిల్లా కాన్ఫరెన్స్‌కు జమ్మలమడుగు రోటరీ క్లబ్ శాఖ నుంచి 15 మంది సభ్యులు వెళ్లారన్నారు. కర్నాటక, ఆంధ్రప్రదేశ్ రోటరీక్లబ్ సభ్యులు పాల్గొన్నారన్నారు. ఇంటర్నేషనల్ స్థాయిలో రోటరీ క్లబ్ 3160 పరిధిలో సాధించిన విజయాలు, సమాజానికి చేసిన సేవా కార్యక్రమాల గురించి చర్చించి, భవిష్యత్ కార్యాచరణ ఏర్పాటు చేశారన్నారు. చేసిన సేవల గురించి రోటరీ క్లబ్ 3160 గవర్నర్ ఒమ్మిన సతీష్‌బాబు కొనియాడారన్నారు. సీబీఐ విశ్రాంత అడిషనల్ డైరెక్టర్ జెడి లక్ష్మీ నారాయణ నవ సమాజ నిర్మాణానికి యువత భావిభారత పౌరులుగా చేయవలసిన అంశాల గురించి తెలిపారన్నారు. ప్రముఖ గాయకుడు గజల్ శ్రీనివాస్, సినీ ప్రముఖ హాస్యనటుడు అలీ ప్రసంగించారన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ సతీమణి చరణకుమారి, ఎఒ సతీమణి ఎం.రాధ, ఎం.వి.దివ్య, ఎం.వి.నిహాల్‌రెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న జమ్మలమడుగు రోటరీ క్లబ్ సభ్యులు

అధిక ధరలకు మాంసం విక్రయాలు

- ఆగ్రహించిన వినియోగదారులు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ఎర్రగుంట్ల మున్సిపల్‌పరిధిలో అధిక ధరలకు మాంసం విక్రయాలు జరుగుతుండడంతో వినియోగదారులు ఆగ్రహించిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. చికెన్, మటన్ ధరలు అధికంగా అమ్ముతున్నారంటూ పరిసర ప్రాంతమైన ప్రొద్దుటూరులో చికెన్ కిలో రూ.150 నుండి రూ.160 అమ్ముతున్నారని, ఇక్కడ మాత్రం రూ.180 నుంచి రూ.200 ధర పెట్టారని ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. మటన్ రూ.800కు అమ్ముతున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధిక ధరలకు మాంసం విక్రయిస్తున్నా అధికారులు మాత్రం ఎందుకు పట్టించుకోవడం లేదో అర్థం కావడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రజలకు మద్దతుగా కొందరు వైసిపి నాయకులు దుకాణాల దగ్గరకు చేరుకొని రేపటి నుండి చికెన్ రూ.150 నుండి రూ.160గా, మటన్ కిలో రూ.700గా విక్రయించాలన్నారు. లేకుంటే ఆందోళన చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. కొందరు దుకాణదారులు మాట్లాడుతూ పలువురికి ముడుపులు ఇవ్వాల్సి వస్తోందని తెలిపారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని ధరలు పెంచాల్సి వచ్చిందని పేర్కొన్నారు. మున్సిపల్ కమిషనర్ జగన్నాథ్‌ను ఫోన్ ద్వారా వివరణ కోరగా.. మాంసం దుకాణదారులతో మంగళవారం సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. అధిక ధరలకు విక్రయించకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో కల్లూరు గంగాధర్‌రెడ్డి, సానేపల్లి మధుసూదన్‌రెడ్డి, రాచమల్లు రాజవర్ధన్‌రెడ్డి, సాంబశివారెడ్డి, పద్మనాభరెడ్డి, రామ్మోహన్, స్థానికులు పాల్గొన్నారు.



దుకాణాదారుడితో మాట్లాడుతున్న వినియోగదారులు

ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకోవాలి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని మాంసం విక్రయించాలని మున్సిపల్ కమిషనర్ వివి నరసింహారెడ్డి సూచించారు. పట్టణంలోని మాంసపు దుకాణాలను ఆదివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిషేధిత ప్లాస్టిక్ కవర్లను వాడరాదన్నారు. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తే సదరు మాంసపు అంగడి ట్రేడ్ లైసెన్స్ రద్దు చేసి, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మాంసపు ధరలు కూడా ఇష్టానుసారంగా పెంచి అమ్ముతున్న వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం డివైడర్లలో పెంచుతున్న పూలమొక్కలను పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం కార్నర్

షార్ట్ సర్క్యూట్‌తో అరటితోట దగ్ధం

- రూ.8లక్షల ఆస్తి నష్టం

ప్రజాశక్తి - లింగాల

మండల పరిధిలోని ఇప్పట్ల గ్రామంలో ఆదివారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అరటితోట దగ్ధమైంది. ఈ ప్రమాదంలో రూ.8లక్షల మేర నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు ఓబుల్‌రెడ్డి వాపోయాడు. గ్రామ కొండ ప్రాంతంలో రెండెకరాల పొలం ఉందని, ఆ పొలంలో రెండవ కోతే అరటిపంట సాగులో ఉందని, మరో రెండు రోజుల్లో వ్యాపారులు అరటికాయలు కోసేందుకు వస్తున్నారని రైతు తెలిపాడు. ప్రమాదంలో 1500 అరటిచెట్లు పూర్తిగా కాలిపోయాయి. పైపులు, డ్రిప్ పరికరాలు మొత్తం బూడిదయ్యాయని బాధిత రైతు వాపోయాడు. ప్రమాదం జరిగిన వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో మంటలు ఆర్పేశారు. ఓబుల్‌రెడ్డి పొలం పక్కన ఒకేచోట దాదాపు 15 వరకు బోరుబావులు ఉన్నాయి. అక్కడున్న విద్యుత్ వైర్లు పూర్తిగా కాలిపోయాయి. సంఘటన స్థలాన్ని ఆర్ఐ సురేందర్ పరిశీలించారు.



కాలిపోయిన అరటితోట

ఖర్చులు ఎక్కువ.. దిగుబడి తక్కువ

నష్టాలే తప్ప.. లాభాలు లేవు : మిరప రైతులు



దిగుబడి వచ్చిన మిరపకాయలు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

జిల్లాలో సరైన దిగుబడి లేక మిరప పంట రైతులు లబోదిబోమంటున్నారు. జిల్లా మొత్తం 4500 నుంచి 5000 ఎకరాల్లో రైతులు ఎండు మిర్చి సాగు చేశారు. ఎకరాకు దాదాపు రూ.1,50,000 ఖర్చు పెట్టామని, దిగుబడి మాత్రం ఆ మేరకు రావడం లేదని రైతుల్లో ఆందోళన నెలకొంది. మందులు పిచికారి చేయడానికి ఎకరాకు దాదాపు రూ.70వేల నుంచి లక్ష వరకు ఖర్చు వస్తుంది. పంటను రెండు దఫాలుగా కోయాల్సి వస్తుంది. మొదటి కోతకు ఎకరాకు కూలీలు దాదాపు 100 మంది అవసరం. కూలి రూ.250తో 25 వేల వరకు ఖర్చు వస్తే, రెండో కోతకు రూ.40వేల నుంచి 45 వేల వరకు ఖర్చు వస్తుంది. మరోవైపు సేద్యానికి, కోత అనంతరం సరైన ధర లేకపోతే కోల్డ్ స్టోరేజ్‌లో నిల్వ ఉంచి అమ్మవలసి ఉంటుంది. పంట వేసినప్పటినుంచి అమ్మే వరకు మొత్తం ఖర్చేనని రైతులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం ఒక క్వింటా తేజ మిరప రూ.18,500 నుండి రూ.19 వేల వరకు ధర పలుకుతోంది. ఇతర రకం మిరప రూ.130 నుంచి రూ.150 వరకు ధర ఉంది. గతంలో ఇతర రకం మిరప రూ.230 నుంచి రూ.250 వరకు ధర ఉండగా.. ప్రస్తుతం రూ.100 ధర తగ్గడం.. దానికి తోడు సరైన దిగుబడి రాకపోవడంతో రైతులు నష్టపోతున్నారు. కనీసం పెట్టుబడి కూడా రాని స్థితిలో కొంతమంది రైతన్నలున్నారు. మిరపసాగులో ఖర్చు పెరిగిందని, ప్రభుత్వం ఆదుకోవాలని మిర్చి రైతులు కోరుతున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి



మిరప పంట సాగు చేయడానికి ఖర్చు ఎక్కువ. ఆశాజనకంగా దిగుబడి లేదు. పురుగు మందులకే ఎకరాకు దాదాపు రూ.80 వేలు ఖర్చు పెట్టాల్సి వస్తోంది. కూలి పెరిగింది. తేజ మిరపకు తప్ప ఇతర మిరప పంటకు ధర లేదు. ప్రభుత్వం ఆదుకోవాలి.

- నాగేశ్వరరెడ్డి, రైతు, కన్నెలూరు

పంట అధికంగా సాగుతో ధర తగ్గింది

ఈ ఏడాది ఎండు మిరపను రైతులు అధికంగా సాగు చేయడంతో ధర తగ్గింది. గతంలో ఉమ్మడి కర్నూలు, గుంటూరు జిల్లాల్లో తక్కువ సాగు చేశారు. ఫలితంగా రేటు అధికంగా ఉండేది. ఈ ఏడాది రైతులు ఎక్కువ మంది సాగు చేయడంతో ధరలు తగ్గాయి. ప్రభుత్వం ప్రకటించిన గిట్టుబాటు ధర కంటే మార్కెట్‌లో మిరపకు అధికంగా ధర ఉంది.

- భరత్‌కుమార్‌రెడ్డి, ఉద్యానశాఖాధికారి

పొత్తు నిర్ణయం.. అభినందనీయం

ప్రజాశక్తి - వేంపల్లె

బిజెపి దుష్ట పాలన నుండి దేశానికి విముక్తి కలిగించేందుకు భావ సారూప్యతగల లౌకిక, ప్రాంతీయ పార్టీలతో పొత్తు పెట్టుకోవాలని నిర్ణయించడం అభినందనీయమని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాయ్‌పూర్ ప్లీనరీ కాంగ్రెస్ చరిత్రలో, దేశ చరిత్రలో ఒక మైలురాయి అన్నారు. ఈ ప్లీనరీ ద్వారా కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తథ్యమని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదా అమలుకు, విభజన చట్టంలోని అన్ని అంశాల అమలుకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని తీర్మానించడం హర్షణీయమన్నారు. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని మరింత పటిష్టం చేయాలని తీర్మానించడం గమనార్హమని ఆయన తెలిపారు. ఇవిఎం స్థానంలో మళ్లీ బ్యాలెట్ పేపరు పద్ధతిని ప్రవేశపెట్టాలని, అందుకు కేంద్ర ఎన్నికల సంఘాన్ని కలవాలని, న్యాయస్థానాల ద్వారా పోరాటం చేయాలని నిర్ణయించడం అభినందనీయమని పేర్కొన్నారు. పార్టీ పదవుల్లో 50 శాతం బలహీన వర్గాలకు, యువతకు, మహిళలకు కేటాయించడం నిర్ణయించడం సంతోషకరమన్నారు. రాయ్‌పూర్ ప్లీనరీ దేశానికి, రాష్ట్రానికి, కాంగ్రెస్ పార్టీకి దిశా, దశ నిర్దేశించిందనడంలో సందేహం లేదన్నారు. బిజెపి దేశాన్ని అప్పుల కుప్ప చేసిందన్నారు. ప్రభుత్వ ఆస్తులు అమ్మడంతోపాటు ధరలు సామాన్యునికి అందుబాటులో లేకుండా చేసిందన్నారు. రాజ్యాంగ వ్యవస్థలను దుర్వినియోగం చేస్తున్నట్లు ఆరోపించారు. బిజెపి పాలనలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని విమర్శించారు. పార్టీ పిరాయింపులను పోత్సహించడం ద్వారా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం 8 రాష్ట్రాల్లో బిజెపియేతర రాష్ట్ర ప్రభుత్వాలను కూల్చేసిందన్నారు. సమావేశంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, జిల్లా ప్రధాన కార్యదర్శులు రామకృష్ణ, ఉత్తన్న, చెన్నకేశవ, మండలశాఖ అధ్యక్షుడు నరసింహారెడ్డి, బద్రీ, రాఘవయ్య, శివ పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి

వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఆర్‌డిఒ శ్రీనివాసులు, సివిల్ జడ్జి బాబా ఫక్రుద్దీన్

ప్రజాశక్తి - జమ్మలమడుగు

వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జమ్మలమడుగు ఆర్‌డిఒ శ్రీనివాసులు కోరారు. పట్టణంలోని బాలాజీ హైస్కూల్ ప్రాంగణలో ఆదివారం ఏర్పాటు చేసిన మెగా వైద్య శిబిరాన్ని ఆర్‌డిఒ శ్రీనివాసులు, జమ్మలమడుగు జూనియర్ సివిల్ జడ్జి షేక్ బాబా ఫక్రుద్దీన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్య శిబిరం నిర్వాహకులు మాట్లాడుతూ మెగా ఉచిత వైద్య శిబిరంలో దాదాపు 600 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులను పంపిణీ చేశామన్నారు. 25 మందిని మెరుగైన వైద్యం అందించేందుకు ఆరోగ్యశ్రీ కార్డు ద్వారా కర్నూలులోని కిమ్స్ హాస్పిటల్‌కు వైద్యులు రెఫర్ చేశారన్నారు. వైద్య శిబిరంలో ఇసిజి, 2డిఎకో, రాండమ్ బ్లడ్, బిపి, క్రయాటిన్ తదితర వైద్య పరీక్షలు ప్రజలకు అందించామన్నారు. సివిల్ జడ్జ్ షేక్ బాబా ఫక్రుద్దీన్ మాట్లాడుతూ హైకోర్టు లాయర్ బైరెడ్డి లక్ష్మిరెడ్డి తల్లిదండ్రులు బైరెడ్డి సూర్యనారాయణరెడ్డి, సుశీలమ్మ జ్ఞాపకార్థం ప్రజలకు ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించడం ఎంతో అభినందనీయమని తెలిపారు. ప్రజలకు ఉపయోగపడే ఇలాంటి కార్యక్రమాలను మరెన్నో బైరెడ్డి లక్ష్మిరెడ్డి నిర్వహించాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో డిఎస్‌పి నాగరాజు, బాలాజీ విద్యాసంస్థల డైరెక్టర్ బైరెడ్డి రవీంద్రారెడ్డి, వైద్యులు, రోగులు పాల్గొన్నారు.

అచ్చమైన తెలుగు వాక్యం.. తవ్వా వెంకటయ్య

ప్రజాశక్తి - చాపాడు

అచ్చమైన తెలుగు వాక్యం లాంటివాడు తవ్వా వెంకటయ్య అని ప్రముఖ రచయిత సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి కొనియాడారు. మైదుకూరు కడప రోడ్డులోని సాయి భగవాన్ కల్యాణమండపంలో ఆదివారం ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం సభ్యులు డాక్టర్ తవ్వా వెంకటయ్యకు అభినందన సభ ఏర్పాటు చేశారు. రాటా ఆధ్వర్యంలో బొమ్మిశెట్టి మోహన్, బొమ్మిశెట్టి రమేష్, శీలం విశ్వనాథ్ నిర్వహించారు. సభకు సీనియర్ జర్నలిస్ట్ పవన్ పంతులు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా సన్నపరెడ్డి మాట్లాడుతూ కడప జిల్లా అచ్చ తెలుగు గని అని మా మిత్రుడు మర్రి నరసింహారెడ్డి తనకు చెప్పారని పేర్కొన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య అధికార భాషా సంఘం సభ్యులు వారధి లాంటివారని తెలిపారు. పులివెందుల రచయిత వంగల కొండారెడ్డి మాట్లాడుతూ తవ్వాకు అభినందన సభ బొమ్మిశెట్టి బ్రదర్స్ నిర్వహించడం గొప్ప విషయమన్నారు. మరో రచయిత షబ్బీర్ మాట్లాడుతూ కడప జిల్లాలో ఏ కథకైనా సమీక్ష చేయాలంటే ఏ ఒక్కరూ లేరని, అన్ని చూపులు, అన్ని వేళ్లు ఒక వ్యక్తిపైనే ఉంటాయని.. ఆ వ్యక్తే తవ్వా వెంకటయ్య అని తెలిపారు. మరో రచయిత షేక్ మహమ్మద్ బాషా మాట్లాడుతూ అధికార భాషా సంఘానికి అందం, సొగసు, వన్నె తవ్వా వెంకటయ్య తీసుకొస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. తవ్వా వెంకటయ్య ఒక వ్యక్తిగా కాక శక్తిగా ఎదిగిన క్రమం అభినందించదగినదని వివరించారు. మైదుకూరు సీనియర్ రిపోర్టర్ బొమ్మిశెట్టి మోహన్ మాట్లాడుతూ వెంకటయ్య అధికార భాష సంఘం సభ్యులుగా ప్రభుత్వం నియమించడం అర్హునికి అందలం ఎక్కించడమేనని అన్నారు. అంతర్జాలంలో జిఒలు ఆంగ్లంలో ఉండడం వల్ల అవి ఎవరికీ అర్థం కావన్నారు. వాటిని తెలుగులోనే ఉంచాలని ఆయన కోరారు. సభలో రాటా అధ్యక్షుడు కొండపల్లి శేషగిరి, మేధా జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ విజయభాస్కర్, ప్రధానోపాధ్యాయులు ఎవి రమణయ్య, కత్తి గురువారెడ్డి, రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్దన్‌రాజు మాట్లాడారు. అభినందన సభలో తవ్వాకు ప్రశంసాపత్రాన్ని బొమ్మిశెట్టి మోహన్, రమేష్, రచయిత షేక్ మహమ్మద్ బాషా అందజేశారు. తిప్పిరెడ్డిపల్లె నడిపి సుబ్బరాయుడు, కైపు బాలరాజును కూడా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సాహితీ మిత్రులు, రచయితలు, కవులు, ప్రజలు పాల్గొన్నారు.



తవ్వా వెంకటయ్యను అభినందిస్తున్న బొమ్మిశెట్టి బ్రదర్స్, కవులు

సమస్యల పరిష్కారంలో ఎమ్మెల్యే దిట్ట

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

సమస్యలను పరిష్కరించడంలో ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాదరెడ్డి దిట్ట అని కృష్ణాలయం దేవస్థానం చైర్మన్ చల్లా రాజగోపాల్ యాదవ్ కొనియాడారు. కృష్ణాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన గోశాలను ఆదివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా చల్లా మాట్లాడుతూ గోశాల ఏర్పాటు విషయమై ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కోవాల్సి వచ్చిందని, వాటిని మంచి మనసుతో ఎమ్మెల్యే పరిష్కరించారన్నారు. కార్యక్రమంలో ఎంపిపి శేఖర్‌యాదవ్ ఆలయ కమిటీ సభ్యులు, రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ బండారు లక్ష్మీదేవి దంపతులు, భక్తులు పాల్గొన్నారు.

ఉద్యోగుల బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

కొంత కాలంగా పరిష్కారానికి నోచుకోని ఆర్‌టిసి ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎన్‌ఎంయు రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.వి.శివారెడ్డి కోరారు. స్థానిక సమావేశ మందిరంలో ఆదివారం ఎన్‌ఎంయు ఆధ్వర్యంలో రీజినల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీజన్‌వ్యాప్తంగా నెలకొని ఉన్న సమస్యలు పరిష్కరించాలని కోరారు. గతంలో పలు మార్లు కోరినప్పటికీ జిల్లా అధికారులు పరిష్కరిండంలో విఫలమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగుల తీవ్ర నిరాశకు గురయ్యారని, ఫలితంగా రీజియన్ వ్యాపితంగా ఆందోళనా కార్యక్రమాలు నిర్వహించవలసి వస్తోందన్నారు. ఉద్యోగస్తులకు ఎఎఎస్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలన్నారు. గత ఏడు నెలలుగా బకాయిలు ఉన్న ఒటిలు చెల్లించాలన్నారు. ఉద్యోగోన్నతులు, బదిలీలు చేపట్టాలన్నారు. రీజియన్ పరిధిలోని మైదుకూరు, కడప డిపో అధికారులు ఉద్యోగస్తులపై వేధింపులను మానుకోవాలన్నారు. కార్యక్రమంలో రీజినల్ చైర్మన్ పి.రామిరెడ్డి, కార్యదర్శి సుధాకర్, జోనల్ నాయకులు రామకృష్ణ, రీజనల్ నాయకులు మోహన్‌రెడ్డి, దాసు, డిపోల అధ్యక్ష, కార్యదర్శులు, గ్యారేజ్ కార్యదర్శులు పాల్గొన్నారు.

విప్లవ కవుల్లో మహమూద్ ముందుంటారు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు



పుస్తకావిష్కరణలో వక్తలు

జీవితం చుట్టూ ఉన్న కన్నీటి పోరాటాలను విప్లవంలో పోరాడుతున్న ప్రజల గురించి అందులో నేల కొరిగిన వీరుల గురించి రాసిన విప్లవ కవుల్లో మహమూద్ ముందు వరుసలో ఉంటారని విరసం మాజీ కార్యదర్శి పాణి పేర్కొన్నారు. జనవిజ్ఞానవేదిక, మిత్రజ్యోతి సాహితీ సాంస్కృతిక సంస్థ, విరసం సంయుక్తంగా ఆదివారం మూడు సాహిత్య పుస్తకాల ఆవిష్కరణ సభను రోటరీక్లబ్‌లో నిర్వహించారు ఈ సందర్భంగా పాణి మాట్లాడుతూ మనిషి జీవితంలోని దుఖాన్ని చెబుతూ భవిష్యత్‌ను అత్యున్నతంగా ఊహిస్తున్న కవిత్వం మహమూద్ రాసిన ఆస్మాని కవిత్వమని కొనియాడారు. కార్యక్రమంలో కేంద్ర సాహిత్య అవార్డు గ్రహీత సజయ మాట్లాడుతూ వర్తమాన సమాజంలో హింసాత్మకమైన లైంగిక పరిభాష పెరుగుతోందన్నారు. ఏ రకమైన గుర్తింపు, హక్కు లేకుండా బతుకుతున్న వారి గురించి సమాజం ఆలోచించడం అవసరమన్నారు. లైంగికత్వం అంటే సెక్స్ కాదని, మనిషి తనను తాను వ్యక్తీకరించుకోవడం అన్నారు. పావని రాసిన సిక్స్ పాక్ రాముడు కథా సంకలనాన్ని ప్రముఖ కథా రచయిత వేంపల్లి షరీఫ్ సమీక్షిస్తూ ఈ కథ దేవుళ్ల ఆకారంలో వస్తున్న మార్పులను సూచిస్తోందన్నారు. వర్తమాన మానవ సమాజంలో అనేక అస్తిత్వాలు ఎంత తపన పడుతున్నాయో ఈకథలో పావని తెలియజేశారన్నారు. తెలుగు అధ్యాపకులు డాక్టర్ దస్తగిరి అధ్యక్షత వహించగా, డాక్టర్ వినోదిని, జెవివి రాష్ట్ర కార్యదర్శి సురేష్, విరసం కార్యవర్గ సభ్యులు వరలక్ష్మి, ప్రముఖ కవులు ఎ.సి.దస్తగిరి, రామాయణం రాజేశ్వరి, కాశీవరపు వెంకటసుబ్బయ్య, పల్లవోలు రమణ పాల్గొన్నారు.



ఉచిత వైద్య శిబిరంలో డాక్టర్లు, నిర్వాహకులు

పేదలకు సేవ చేయడమే అవోపా లక్ష్యం

ప్రజాశక్తి - వేంపల్లె

పేదలకు సేవ చేయడమే అవోపా లక్ష్యమని ఆ సంఘం అధ్యక్షులు గోవర్దన్ తెలిపారు. వేంపల్లెలోని అమ్మవారిశాల ఆవరణలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచితహోమియో వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చిందని ఆయన తెలిపారు. వేంపల్లె ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవోపా) ఆధ్వర్యంలో ఈ వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కడపకు చెందిన ప్రముఖ హోమియో వైద్యులు డాక్టర్ క్రిస్టిపాటి వెంకట శేషఫణి రోగులకు వైద్య పరీక్షలు చేశారు. 102 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. వైద్య శిబిరంలో హోమియో క్యాంపు ఛైర్మన్ సాయి సత్యనారాయణ, పోలేపల్లె రమేష్‌బాబు, నారాయణ, సాయికిరణ్, సాయికౌశిక్, కిరణ్‌కుమార్, అరుణ్ పాల్గొన్నారు.

దాతృత్వం చాటిన 'మానవతా'

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల



శ్రీనివాసరెడ్డికి ఆర్థికసాయాన్ని అందిస్తున్న మానవతా సభ్యులు

పట్టణ పరిధిలోని రేవంత్‌రెడ్డి అనే నాలుగేళ్ల పిల్లాడికి ఎర్రగుంట్ల మానవతా స్వచ్ఛంద సంస్థ తరపున ఆర్థిక సాయాన్ని అందించారు. ఆ సంస్థ నెలవారీ సమావేశాన్ని ఆదివారం స్థానిక గౌతమ్ హై స్కూల్‌లో జిల్లెల చెన్నకేశవరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ నెలలో చేసిన కార్యక్రమాల గురించి, రాబోయే నెలలో చేయవలసిన సేవా కార్యక్రమాల గురించి సభ్యులందరి సలహాలు అడిగి తీసుకున్నారు. పట్టణ పరిధిలో శ్రీనివాసరెడ్డి అనే వ్యక్తి గని పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆర్థికస్థోమతలేక తన నాలుగేళ్ల కుమారుడు రేవంత్‌రెడ్డికి నిమోనియా వైద్యం చేయించలేదు. ఇందుకు స్పందించిన మానవతా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రూ.34వేలు ఆర్థికసాయాన్ని అందించారు. మానవతా సంస్థ జిల్లా ఉపాధ్యక్షులు రమణారెడ్డి మాట్లాడుతూ పట్టణ పరిధిలోని అంధులకు మానవతా స్వచ్ఛంద సంస్థ తరపున ప్రతినెల రూ.400 పింఛన్ అందివ్వాలని సభాముఖంగా కోరారు. కార్యక్రమంలో మానవత సంస్థ అధ్యక్షులు గంగాధర్‌రెడ్డి, విశ్రాంత ఉద్యోగులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

సొసైటీ అభివృద్ధికి సహకరించాలి

ప్రజాశక్తి - వేంపల్లె

రుణాలను సకాలంలో చెల్లించి సొసైటీ అభివృద్ధికి సహకరించాలని శ్రీలక్ష్మి నరసింహ టీచర్స్ హౌస్ బిల్డింగ్ సొసైటీ అధ్యక్షుడు నరసింహారెడ్డి కోరారు. ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో శ్రీ లక్ష్మీనరసింహా టీచర్స్ హౌస్ బిల్డింగ్ సొసైటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హౌస్ బిల్డింగ్ సొసైటీలో ఉన్న సభ్యులందరికీ స్థలాలు ఏర్పాటు చేయుటకు సొసైటీ కృషి చేస్తున్నట్లు తెలిపారు. నందిపల్లి వద్ద సభ్యులకు కేటాయించిన స్థలాలకు సంబంధించిన కోర్టు కేసుల పరిష్కారానికి ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. సొసైటీ కల్పించిన రుణ సదుపాయాన్ని ఎక్కువ మంది సభ్యులకు అందుబాటులోకి తెచ్చేందుకు ఆ మొత్తాన్ని రూ.40,000 నుండి రూ.30,000 వేలుకు తగ్గించేందుకు సభ్యుల నిర్ణయంతో తీర్మానించినట్లు చెప్పారు. రుణంపై వార్షిక వడ్డీని 15శాతం నుండి 18 శాతానికి పెంచినట్లు తెలిపారు. సొసైటీకి కొత్త కార్యవర్గ సభ్యులుగా వి.ప్రతాంరెడ్డి, సంగమేశ్వర్‌రెడ్డి, వై.నరసింహారెడ్డి, పి.వి.సుబ్రమణ్యం, శ్రీని వాసరెడ్డి, ఓబుల్‌రెడ్డి, రాజశేఖర్, సుబ్బారాయుడు, దాదాపీర్, కె.వి.సుబ్బారెడ్డిని ఎన్నుకున్నట్లు వివరించారు. అనంతరం సమావేశంలో సొసైటీ ప్రధాన కార్యదర్శి వి.ప్రతాప్‌రెడ్డి, ఆర్థిక కార్యదర్శి శ్రీనివాసరెడ్డి తమ వార్షిక నివేదికలను ప్రవేశపెట్టారు. సమావేశంలో సొసైటీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సొసైటీ అధ్యక్షులు నరసింహారెడ్డి

దర్శక, నిర్మాతలకు విలువనివ్వాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

తెర ముందు నటించే తారలం తామైతే, తెరవెనుక ఉండి సినిమాను విజయవంతం చేసే అగ్రతారలు దర్శక, నిర్మాతలని, అలాంటి వారికి అత్యధిక విలువనిచ్చి వారి సూచనల మేరకు నటించినప్పుడే ఆ చిత్రం విజయవంతమవుతుందని సీనియర్ సినీనటి రమాప్రభ పేర్కొన్నారు. ఆ మేరకు ప్రొద్దుటూరుకు చెందిన కళాకారుడు గోపాలకృష్ణ తెలిపారు. వేసవి విడిది కోసం ఆమె మదనపల్లి సమీపంలోని హార్సిలీహిల్స్ వచ్చారని కబురు పంపడంతో గోపాలకృష్ణ తన తోటి కళాకారులతో వెళ్లి కలిశారు. ఈ సందర్భంగా ఆయన ఆదివారం 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ సీనియర్ నటీమణులు వై.విజయ, ప్రభతోపాటు జె.డి.చక్రవర్తి మరి కొంత మంది తమిళ యువ కళాకారులు రమాప్రభను కలిశారన్నారు. చిత్రపరిశ్రమ కొత్తపోకడలకుపోతోందన్నారు. సినిమా విజయవంతం కావాలంటే మంచి దర్శకత్వంపై ఆధారపడి ఉంటుందన్నారు. అంతిమ నిర్ణేత దర్శకుడే అన్నారు. నిర్మాతకు ఖర్చు తగ్గించేలా కళాకరులు మసలుకోవాలన్నారు. ఆ రోజుల్లో ఎడ్లబండ్లు కట్టుకొని సినిమాలకొచ్చే వారన్నారు. నేడు అరచేతిలో సినిమాలు చూసే రోజులొచ్చాయని యువకళాకారులకు సూచనలిచ్చారన్నారు. ప్రొద్దుటూరుకు చెందిన నాటి నటీమణి శాంతకుమారిని గుర్తు చేసుకున్నారన్నారు. స్థానికంగా ఆ నటి పేరుమీదనే ఒక వీధి ఉండడాన్ని గుర్తు చేశారు. తన పుస్తకావిష్కరణకు త్వరలో రమాప్రభ ప్రొద్దుటూరుకు వస్తానని హామీ ఇచ్చారని గోపాలకృష్ణ తెలిపారు. ప్రొద్దుటూరుకు చెందిన కళాకారుడు గిరి, పీలేరుకు చెందిన మస్తాన్, రాయచోటికి చెందిన ఈశ్వర్, ముద్దనూరుకు చెందిన సురేష్ ఆమెను కలిసినవారిలో ఉన్నారు.




రమాప్రభను సన్మానిస్తున్న గోపాలకృష్ణ

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని జమ్మలమడుగు టిడిపి ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల భూపేష్‌రెడ్డి తెలిపారు. మండలంలోని చిలంకూరు గ్రామంలో ఆదివారం ఆయన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేశారు. పూల మాలలు, బాణా సంచా పేలుళ్లతో స్థానిక నాయకులు భూపేష్‌రెడ్డికి ఘన స్వాగతం పలికారు. అనంతరం నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరించుకుంటూ గడపగడపకు తిరిగారు. ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, పార్టీ మండలశాఖ అధ్యక్షులు మోహన్‌రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, పులికొండ, వల్లపు సుధాకర్, అరవింద్, పవన్, కుమార్‌రెడ్డి, మాలిక్, సుబ్బరాయుడు, బాబు, సాల్మన్, రంజిత్, నరేష్, మునికృష్ణ, నారాయణరెడ్డి, పవన్, రామ సుబ్బయ్య, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తున్న భూపేష్‌రెడ్డి